
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 10 ఏప్రిల్ 2024





శ్రీకాకుళం : విజయగణపతి ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు





సంతోషిమాతకు అలంకరణ..



శ్రీకాకుళం : నానుబాలవీధిలోని విజయదుర్గమ్మకు ఫలాలతో అలంకరణ

వేడుకగా ఉగాది

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఊరూరా పంచాంగ శ్రవణాలు

(శ్రీకాకుళం కల్చరల్)

తెలుగు నూతన సంవత్సరాది.. ఉగాది వేడుకలను జిల్లావాసులు ఘనంగా జరుపుకొన్నారు. శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభం సందర్భంగా మంగళవారం వివిధ ఆలయాలకు బారులుదీరారు. శ్రీకాకుళంలోని శ్రీవిజయగణపతి ఆలయం, నానుబాలవీధిలోని శ్రీవిజయదుర్గ, శ్రీ సంతోషిమాత, పెద్దబరాటం వీధిలోని నీలమ్మతల్లి ఆలయంతోపాటు తదితర దేవాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. విగ్రహాలు పండ్లు, పూలతో అలంకరించి.. క్షీరాభిషేకాలు, చందనాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. రైతులు ఉదయాన్నే ఏరువాక పూసి నాగళ్లకు పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. మరోవైపు ఇంటింటా షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి సిద్ధం చేసి.. ప్రసాదాన్ని స్వీకరించారు. పలుచోట్ల పండితులు పంచాంగ శ్రవణాలు వినిపించారు. ఈ ఏడాది తమ రాశిఫలాలు ఎలా ఉండబోతాయోనని ప్రజలు ఆసక్తిగా ఆలకించారు. అలాగే నరసన్నపేట బీసీ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థినులు ఉగాది వేడుకలు నిర్వహించారు.



నరసన్నపేట : సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉగాది వేడుకల్లో విద్యార్థినులు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయంలో పంచాంగ శవణం..

ధర పెరిగినా.. తగ్గేదేలే!

- కిటకిటలాడిన వ్యాపార సముదాయాలు
- జిల్లాలో అధికంగా బంగారం, వెండి ఆభరణాలు కొనుగోలు

(నరసన్నపేట/టెక్కలి)

ఉగాది రోజు కొత్త వస్తువు కొంటే శుభపరిణామమని ప్రజల సెంటిమెంట్. ఈ నేపథ్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. ఇటీవల బంగారం, వెండి ధరలు పెరిగినా.. తాము తగ్గేది లేదంటూ చాలామంది ఆభరణాలు కొనుగోలు చేశారు. బంగారం దుకాణాలతోపాటు సెల్‌పాయింట్లు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపించాయి. మంగళవారం ఒక్కరోజే జిల్లావ్యాప్తంగా రూ.కోట్లలో వ్యాపారం సాగింది.

● జిల్లాలో 600పైగా బంగారం, వెండి దుకాణాలు ఉన్నాయి. నరసన్నపేట, టెక్కలి, శ్రీకాకుళం, పలాస, సోంపేట, పాతపట్నంలో బంగారం అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. గతేడాది ఉగాది నాటికి తులం బంగారం ధర రూ.65వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.85,700కి చేరింది. 22 క్యారెట్ల బంగారం ఆభరణాలు రూ.77వేలు పలికింది. కిలో వెండి రూ.85వేలకు చేరింది. బంగారం ఆల్‌టైం రికార్డు సృష్టించినా.. కొనుగోలుదారులు తగ్గకపోవడం గమనార్హం. నరసన్నపేట, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో వ్యాపారులు బంగారం ఆభరణాల కొనుగోలుదారులకు సిల్వర్ క్వాయిన్స్ ఉగాది కానుకగా ఇచ్చారు. మరికొందరు వ్యాపారులు ఆభరణాలపై తరుగు శాతాన్ని తగ్గించారు. గ్రాము ధరపై రూ.50ఆఫర్ ఇవ్వగా, పాత బంగారం విక్రయించేవారికి మరో రూ.50 రాయితీ ఇచ్చారు.

● శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, టెక్కలి, పాతపట్నం, హిరమండలాల్లో గృహోపకరణ వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి. సెల్‌ఫోన్లు, టీవీలు, ఫ్యాన్లు, వాహనాలు, ఫ్రిజ్‌లు, ఏసీలు కొనుగోలు చేశారు. కొంతమంది వ్యాపారులు గృహోపకరణాలకు లక్కీకూపన్లతో బహుమతులను అందజేశారు.



శ్రీకాకుళం : ఎలక్ట్రానిక్స్ దుకాణంలో రద్దీ



నరసన్నపేట : బంగారం షాపులో కొనుగోలుదారులు

బంగారం కొనుగోలుకు వచ్చి..

- తనిఖీల్లో రూ.4.47లక్షల స్వాధీనం


నరసన్నపేట, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా కొత్తవస్తువు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్దామని వారంతా స్వగ్రామాల నుంచి నరసన్నపేటకు వచ్చారు. కానీ సరైన రికార్డులు లేకుండా నగదుతో వచ్చి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు పట్టుబడ్డారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో మొత్తంగా రూ.4,47,600 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలాకి మండలం ఈదులవలస జంక్షన్ వద్ద నరసన్నపేట డీటీ గాయిత్రి ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. పోలాకి మండలానికి చెందిన చింతు కరువమ్మ వద్ద రూ.లక్ష, గేదెల రాజ్యలక్ష్మీ వద్ద రూ.64,600 పట్టుకున్నారు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్రవాహనంపై నరసన్నపేట వస్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డారని డీటీ గాయిత్రి తెలిపారు. మడపాం టోల్‌ప్లాజా వద్ద ఎస్‌ఐ అశోక్‌బాబు వాహనాలను తనిఖీ చేశారు. బంగారం ఆభరణాలు కొనుగోలు చేసేందుకు శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వస్తున్న ఒక కుటుంబం నుంచి రూ.2.83లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఆర్వో జీవీజీ రామ్మోహన్‌రావుకు అప్పగించారు. ఎన్నికల నిబంధన మేరకు కేసు నమోదు చేసి ఉపఖజానా కార్యాలయంలో నగదు సీజ్ చేశామన్నారు. బాధితులు పత్రాలు తీసుకువచ్చి నగదు పొందవచ్చని ఆర్వో రామ్మోహన్‌రావు తెలిపారు.

పైడిభీమవరంలో రూ.6.75 లక్షలు

రణస్థలం: పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద మంగళవారం జేఆర్ పురం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. అనపర్తికి చెందిన ఎస్.సురేష్‌రెడ్డి కారులో రూ.6.75లక్షలను గుర్తించినట్లు ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న ఈ నగదును ఆర్వోకు అప్పజెప్పామన్నారు.



పైడిభీమవరం వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



అంబరాన ఉగాది సంబరం

● గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణం ● ఏరువాక పూజలు చేసిన రైతులు ● తెలుగు సంవత్సరం సందర్భంగా ఆలయాలు కిటకిట


టెక్కలి: కొల్లివలసలో పంచాంగ శ్రవణం

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇళ్లలో లక్ష్మీదేవికి పూజలు చేసి ఉగాది పచ్చడిని స్వీకరించారు. అనంతరం ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున రైతులు ఏరువాక పూజలు చేసి పొలాలను సందర్శించారు. ఈ ఏడాది పాడిపంటలు వృద్ధి చెందాలని కోరుకున్నారు. అన్ని గ్రామాల్లోనూ ఆలయాలు, గ్రామ కూడళ్లలో వేద పండితులు, పురోహితులు పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పలు ఆలయాలు, రామ మందిరాల్లో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామిని పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: సారవకోట మండలం తొగిరిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్థులు


నరసన్నపేట: శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా స్వామిని దర్శించుకుంటున్న జట్టు కళాసీ సంఘ నేతలు


ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ రామాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మందస: వాసుదేవ ఆలయంలో గరుడ స్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


అరసవల్లి: ఆదిత్య ఆలయంలో పండితులను సత్కరించిన దృశ్యం


దీర్ఘాశి(పోలాకి)లో పంచాంగ శ్రవణం


హిరమండలం: పెద్దకోరాడ వీధి నీలమణిదుర్గ ఆలయంలో దీపారాధన


ఇచ్ఛాపురం: కవులను సన్మానిస్తున్న దృశ్యం


పలాస: సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం


పొందూరు: పెనుబర్తిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


గార: శ్రీకూర్మనాథ స్వామి ఆలయ అర్చకులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్న ఈవో గురునాథరావు


పాతపట్నం: జగన్నాథాచార్యులకు ఉగాది పురస్కారం అందిస్తున్నదేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్

వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే: గోవిందరావు

పాతపట్నం: కేంద్ర, రాష్ట్రాలలో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే అని పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షిస్తూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సారధ్యం లో రాష్ట్రంలో త్వరలో జెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుం దన్నారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణాన్ని పండితులు నిర్వహించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న మామిడి గోవిందరావు

టీడీపీలోకి చేరికలు

● కందువాలు వేసి ఆహ్వానించిన శిరీష, శివాజీ


హరిపురం: పార్టీలో చేరిన వారితో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష

పలాస/హరిపురం: నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మందస మండలం సరియాపల్లి, జిల్లుండ గ్రామాలకు చెందిన ధనుజంయ్, మోహనరావు, గుణశేఖర్, మురళీ, దుర్యోధ, చిన్నాలతో 30 కుటుంబాలు, వజ్రపుకొత్తూరు మండలం మహదేవపురం గ్రామానికి చెందిన 80 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. ఆలాగే బెండి గ్రామానికి చెందిన కె.మోహనరావు, సింహాచలం, హెచ్.వెంకటరావు, శ్రీనివాసరావు, సింహాచలం తదితర 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ పలాస అభ్యర్థి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మహిళలు, గ్రామస్థులు శిరీష, శివాజీలకు శాలు వాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు మెట్ట రమణ, మోహన్, సుధాకర్, టీడీపీ నాయకులు కణితి సురేష్, హనుమంతు గిరి, నవీన్ యాదవ్, కొర్రాయి శ్రీను, హేమసుందర్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గుణుపల్లి వైసీపీ కుటుంబాలు

వజ్రపుకొత్తూరు: గుణుపల్లి పంచాయతీకి చెందిన 70 వైసీపీ కుటుంబాలు మంగళవారం సాయంత్రం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ చొక్కర దేవాకమ్మ, మైలపల్లి అఖిల్, చొక్కర వంశీ తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు జోగి తిరుపతి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉమ్మడి ప్రభుత్వం: బగ్గు

నరసన్నపేట: దివ్యాంగులకు ఉమ్మడి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ అభ్యర్థి బగ్గు రమణ మూర్తి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హయాంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయగా ప్రస్తుత వైసీపీ పాలనలో దివ్యాంగులకు ఆదుకునేవారే లేరన్నారు. చంద్రబాబు సీఎంగా అయిన వెంటనే దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు సంక్షేమ సంఘ నాయ కుడు ఉన్నా సాయికుమార్, జనసేన కన్వీనర్ బలగ ప్రవీణ్, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త లక్ష్మణరావు, టీడీపీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దుచిట్టిబాబు, ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు, కింజరాపు రామారావు, యాళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి రమణమూర్తి

సహచర మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదువుకున్న విద్యా ర్థులు తమ సహచరుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సహచర విద్యార్థి బడక మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య గీతకు రూ.50 వేలు నగదును అందిం చారు. కార్యక్రమంలో రాంబాబు, ఉమాపతి, నీలయ్య, జగదీష్, రాంబాబు, నారాయణ పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న దృశ్యం

అమ్మవార్లకు ముర్రాటలు

● ఉత్సవ మూర్తులకు తిరువీధి మహోత్సవం

పలాస, ఏప్రిల్ 9: పలు గ్రామాల్లోని గ్రామ దేవతలకు మంగళవారం ఆయా గ్రామాల మహిళలు ముర్రాటలు సమర్పించారు. స్థానిక అన్న పూర్ణాశ్రమం వద్ద ఉన్న గ్రామదేవత బడ్డిపోలమ్మ అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించారు. ప్రతిఏటా ఉగాది నాడు కమిటీ సభ్యులు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ మూర్తులకు ఊరేగించారు. అమ్మవారిని టీడీపీ పలాస ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్న చౌదరి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు దర్శించుకుని పూజలు చేశారు.


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

బ్రాహ్మణతర్లాలో కాటమ్మతల్లికి..



పలాసరూరల్: బ్రాహ్మణతర్లాలో వెలిసిన కాటమ్మతల్లికి ఉగాది సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు చేసి ప్రత్యేక వంటకాలను సమర్పించారు. అలాగే తర్లాకోటలోని కాటమ్మతల్లి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పంగవానిపేటలో ఇంద్రాక్షమ్మకు..

జలుమూరు: పంగవానిపేట సమీపంలో కొలువు తీరిన ఇంద్రాక్షమ్మ తల్లికి మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంగవానిపేట, చల్లవానిపేట పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు ఉదయాన్నే ఏరువాక సాగించి అనంతరం మంగళ వాయిద్యాలతో కలశాలను పట్టుకుని ఆలయానికి వచ్చి ముర్రాటలు సమ ర్పించి చల్లదనం చేశారు. ఆలయం ఎదురుగా అరటి గెలలను వేలాడ దీశా రు. కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


ఇంద్రాక్షమ్మకు ముర్రాటలు చెల్లించేందుకు క్యూలైనులో నిరీక్షిస్తున్న మహిళలు, భక్తులు

పింఛన్ అందించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో లచ్చుమన్న పేటకు చెందని పొట్నూరు కామేశ్వరమ్మకు పంచాయతీ అధికారులు పింఛన్ అందించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పింఛన్ అందక.. మందులు కొనలేక' శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కామేశ్వరమ్మకు ఎందుకు పించ న్ ఇవ్వలేదో కారణాలను ఎంపీడీవో రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఈవో చిన్నారావు ఆమె ఇంటికి వెళ్లి స్వయంగా వృద్ధాప్య పింఛన్ సొమ్మును అందించారు. కామేశ్వరమ్మకు పింఛన్ వచ్చేందుకు సహకరించిన ఆంధ్రజ్యోతికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

టెక్కలి కాంగ్రెస్ అభ్యర్థిగా కృపారాణి



టెక్కలి: టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కిల్లి కృపారాణిని ఖరారు చేస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మంగళవారం ప్రకటించారు. కృపారాణి శుక్రవారం కడప జిల్లా బద్వేల్‌లో పీసీసీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఈమె 2009 లో ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా పనిచేశారు. కృపారాణిని అభ్యర్థిగా ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

'సూపర్ సిక్స్'పై అవగాహన కలిగించాలి

కాశీబుగ్గ: టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని కాశీబుగ్గ క్లస్టర్ ఇన్‌చార్జి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. మంగళవారం కాశీ బుగ్గలో 29 బూత్‌లకు సంబంధించి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బాబు ష్యూరిటీపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సవర రాంబాబు, చంద్రశేఖర్ త్యాడి, బాడాడ ఉమాకాంత్, కొత్త సత్యం, రామకృష్ణ, కొండే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతాయని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమా రావు, రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం పెద్దతుంగాంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్‌పై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శిమ్మ గోవింద, కూశెట్టి కాంతా రావు, మెండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● **నందిగాం:** టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కవిటి అగ్రహారంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు జానికిరాం, జగదీష్, బంగారు శివ, బాలకృష్ణ, పాల్గొన్నారు.

నేటినుంచి దిమ్మడిజోలలో భాగవత సప్తాహం

నందింగాం: దిమ్మడిజోల గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఏడు రోజు ల పాటు భాగవత సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాపుతెంబూరు దత్త పీఠాధిపతి నిర్విషయానంద స్వామి, వేదపండితులు ప్రసాదరావు శర్మ, మదన్‌మోహన్ మిశ్రాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుం దన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రేమించి పెళ్లిచేసుకుని పొమ్మంటున్నాడు

- బాధితురాలిపై భర్త కుటుంబ సభ్యుల దాడి
- న్యాయం చేయాలని మహిళా సంఘాల డిమాండ్



బాధితురాలిని పరామర్శిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

పలాసరూరల్: తనను ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు మరో పెళ్లి చేసుకుంటానని.. తనను వెళ్లమంటున్నాడని.. ఈ నేపథ్యంలో తనపై ఆడపడచులు దాడికి దిగారని, న్యాయంచేయాలని కోరుతూ ఉద్దానంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ న్యాయపోరాటానికి సిద్ధమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల వివరాల మేరకు.. గురుదాసుపురానికి చెందిన సొర్ర ప్రశాంత్‌ను సమీప గ్రామంలోని ఓ యువతి ప్రేమించి 2022 డిసెంబరులో పెళ్లి చేసుకుంది. ఇప్పుడు ఆమెను కాదని మరోపెళ్లికి ప్రశాంత్ ప్రయత్నిస్తుండడంతో బాధితురాలు గ్రామపెద్దలను వారం కిందట ఆశ్రయించింది. గ్రామపెద్దలు ఇరువురి మధ్య ఒప్పందం కుదర్చడంతో కాపురానికి తీసుకుని వెళ్లేందుకు ప్రశాంత్ అంగీకరించాడు. తరువాత బాధితురాలిని పుట్టింటికి పంపించారు. ఆమె తిరిగి ఇటీవల తన అత్త వారింటికి కాపురానికి వెళ్లగా నీవు వెళ్లిపోవాలని, వేరే పెళ్లి చేసుకుంటానని భర్త స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆడపడుచు, అత్త సొర్ర వరలక్ష్మి తనను వెళ్లి పోవాలని చెబుతూ దాడికి దిగారని బాధితురాలు వాపోయింది. దాడికి గురైన బాధితురాలు ఆదివారం పలాస ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతోంది. తనకు న్యాయం చేయాలని లేకుంటే పోరాటం చేస్తానని ఆమె పేర్కొంటోంది. బాధితురాలికి ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నాగమణి మంగళవారం పరామర్శించారు. దాడి ఘటనను ఖండించారు. బాధితురాలికి న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కాగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ జి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

హరిపురం: మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుపురెడ్డి కృష్ణమూర్తి (55)విశాఖలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. పెద్ద కుమార్తె ఇంటికి కృష్ణమూర్తి వెళ్లారు. తన అల్లుడుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణమూర్తి మృతికి టీడీపీ పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ, టీడీపీ నాయకులు బైరిశెట్టి గున్నయ్య, బావన దుర్యోధన, పుల్లా వాసు, దాసరి తాతారావు, కనగల తేజ తదితరులు సంతాపం తెలియజేశారు.

నీలమ్మతల్లి ఆలయానికి రూ.50 వేలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పెద్దబరాటం వీధిలోగల నీలమ్మతల్లి ఆలయానికి కింతలి నాగేశ్వరరావు, బరాటం బాబ్జీ 50 వేల రూపాయలు అందజేశారు. ఆలయ అధ్యక్షులు బరాటం సాయిరాజ్‌కు అందజేశా రు. ఈ కార్యక్రమంలో పెంటా కిరణ్ శర్మ, రుషి తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. గోతులు

- రాకపోకలకు అవస్థలు
- ఇదీ కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డు దుస్థితి



కవిటి-ఇద్దివానిపాలెం రోడ్డులో మలుపుల వద్ద పిచ్చిమొక్కలు



కొత్తపాలెం జంక్షన్ వద్ద గోతులమయమైన రోడ్డు

కవిటి: కవిటి నుంచి తీరప్రాంత గ్రామాలను కలిపే కవిటి- ఇద్దివానిపాలెం రోడ్డునిర్వహణ నీరుగారుతోంది. ఈమార్గంలో అడుగడుగునా మలుపులు ఉండడంతోపాటు గోతులమయంకావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డంతా అధ్వానంగా మారడంతో రాకపోకలకు మత్స్యకారులకు అవస్థలు తప్పడంలేదు.ఇరుగ్గా ఉండడంతోపాటు రోడ్డుకు ఆనుకుని ఆక్రమణల వల్ల ఎదురుగా వచ్చే వాహనం కూడా తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది.

ట్రాఫిక్ కష్టాలు

కవిటి బస్టాండ్ నుంచి చింతామణి అమ్మవారి ఆలయం వరకు ఉన్న రోడ్డులో ప్రభుత్వకార్యాలయాలు ఉండడంతో తరచూ ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ రహదారిలో రోడ్డుకు ఇరువైపుల పంటపొలాలు, బీలబట్టి కాలువ ఉండడంతోపాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు మలుపుల వద్ద కనిపించడంలేదు. కవిటిబస్టాండ్ నుంచి చింతామణి ఆలయంవరకు ఆక్రమణల పుణ్యమాని రోడ్డు కుదించుకుపోయింది. దీంతో ఇక్కడ ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించడానికి చోదకులు ఇబ్బందిపడుతున్నారు.ఇటీవల కవిటిలో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. పెద్దసంఖ్యలో ద్విచక్రవాహనాలు కొనుగోలు చేస్తుండడంతో వాటి వినియోగం పెరిగింది.దీంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఇక్కడ రోడ్డుపై ట్రాఫిక్‌కష్టాలు తప్పడంలేదు.

మరమ్మతులు లేక..

దశాబ్దాల కిందట నిర్మించిన కవిటి-ఇద్దువానిపాలెం రోడ్డు పూర్తిగా పాడైంది. ఏళ్ల తరబడి నిర్వహణలేక, మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈరోడ్డు దుస్థితిని పలుసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం, కొత్తపాలెం గ్రామాల సమీపంలో రోడ్డు ఇరుగ్గా ఉండడంతో అగచాట్లు తప్పడంలేదని వాహనచోదకులు చెబుతున్నారు.

అడుగడుగునా పిచ్చిమొక్కలు

రోడ్డులో ఒకవైపు బీలబట్టికాలువ, మరోవైపు పంటపొలాలు ఉండడంతో అప్రమత్తంగా వాహనాలు నడపాల్సిఉంది. దీనికితోడు రోడ్డుకు ఆనుకుని అడుగడుగునా పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోయాయి. వీటితో మలుపుల వద్ద రాత్రి వేళల్లో తీరప్రాంత వాసులు తరచూ ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నవిషయంవిదితమే.ఈనేపథ్యంలోస్థానిక ఉషోదయయువజనసంఘం సభ్యులు అధికారులకు ఫిర్యాదుమేరకు ఇటీవల చింతామణికాలనీ వద్ద రోడ్డును ఆక్రమించి నిర్మాణాలుచేయడంతో రెవెన్యూఅధికారులు నోటీసులుజారీచేసి తూతూమంత్రంగా తొలగించారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, రాకపోకలకు అనుకూలంగా రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డును మెరుగుపరచాలి



కవిటినుంచి తీరప్రాంత గ్రామాలకు వెళ్లే రోడ్డును మెరుగుపరచాలి. చింతామణి ఆలయం వరకు రోడ్డు పాడవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. వాహనాల రాకపోకల సమయంలో తరచూప్రమాదాలు ఏర్పడుతున్నాయి. ఈవిషయంపై యువజన సంఘం తరపున అధికారులకు ఫిర్యాదుచేశాం. ఆక్రమణలు తొలగించి మమ అనిపించారు తప్పరోడ్డు దుస్థితి మెరుగుపడలేదు.

\- పి.శేఖర్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు

అమ్మో.. ప్లాస్టిక్

- విచ్చలవిడిగా వినియోగం
- కానరాని నియంత్రణ చర్యలు
- వ్యర్థాలు తిని మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- పర్యావరణానికి తీవ్ర ముప్పు



దాసన్నపేట జంక్షన్‌లో ఇలా..

(ఇచ్ఛాపురం)

పర్యావరణానికి పెను ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. పట్టణం, పల్లె అన్న తేడాలేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలంతా అవస్థలు పడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధమున్నా ప్రజల్లో అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో మాత్రమే పాలిథిన్ సంచులు వినియోగం ఉండేది. ప్రస్తుతం మారుమూల చిన్న పల్లెల్లో కూడా వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. ఇచ్ఛాపురం మండలంలోని 21 పంచాయతీల్లో, మున్సిపాల్టీలోని 23 వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి కార్యక్రమానికి ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లలో సామగ్రి వినియోగించడం ప్రజలకు వ్యసనంలా మారింది. ఇచ్ఛాపురం మున్సిపాల్టీ, మండల పరిధిలో నిత్యం లెక్కలేనంతగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. రోడ్ల పక్కన, షాపుల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.

అమలు కాని ప్లాస్టిక్ నిషేధ చట్టం

పర్యావరణానికి ముప్పు తెచ్చే 40 మైక్రాన్ల కంటే తక్కువ దళసరి ఉన్న ప్లాస్టిక్ పాలిథిన్ సంచులు వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం 2011లో పూర్తిగా నియంత్రించింది. నిషేధం అమల్లోకి వచ్చి 14 ఏళ్లు గడుస్తున్నా కనీస స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగం తగ్గకపోగా నానాటికి పెరిగిపోతూనే ఉంది. అయినా అధికారులు పట్టించుకోనే పాపానపోలేదు. నిత్యావసర సరుకులు చేరవేత నుంచి ఆహారం ప్యాకింగ్ వరకు ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. విందు, వినోదాలు ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకం అలవాటుగా మారిపోయింది. వినియోగించిన ప్లాస్టిక్ సంచులను డంపింగ్ యార్డులకు తరలించినా అవి కుప్పలుగా పేరుకుపోతున్నాయే తప్పా భూమిలో కలిసే పరిస్థితి లేదు. డ్రైనేజీల్లో, పంట కాలువల్లో ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోతున్నాయి.ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, ఇతర మూగజీవులు తినేస్తుండడంతో అవి కూడా మరణించే పరిస్థితి దాపురించింది. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రా పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వాలు పాలిథిన్ వాడకంపై కఠిన నిర్ణయాలు తీసుకొని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

మృత్యువాత పడుతున్న పశువులు

ఇటీవల విస్తృతంగా జరుగుతున్న వివిధఫంక్షన్లలో పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని, వాటిని అరిగించుకోలేక మృత్యువాత పడ్డ ఘటనలు ఇచ్ఛాపురంలో చోటుచేసుకున్నాయి.సురంగిరాజామైదానంఎదురుగా, దాసన్నపేటజంక్షన్ వద్ద, రెండు ఆవులు ప్లాస్టిక్ కవర్లు తిని చనిపోయిన విషయం విదితమే.వాటిని కూడా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నదిలోకి తీసుకుని వెళ్లి పూడ్చారు.



ఎక్కడికక్కడే వాటర్ ప్యాకెట్లు

ప్లాస్టిక్ కవరుతో తయారు చేసిన వాటర్ ప్యాకెట్లను పూర్తిగా వాడకం నివారించామని అధికారుల చెప్పుకుంటున్నా వాటిని మాత్రం ప్రతి ఫంక్షన్‌లో వాటర్ ప్యాకెట్లను వాడుతున్నారు. వీటిపై పురపాలక సంఘ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పెళ్లిళ్ల ఫంక్షన్లతో పాటు రాజకీయ నాయకుల ఏర్పాటుచేసే సమావేశాల్లో కూడా ప్రజలకు వాటర్ ప్యాకెట్లను వినియోగిస్తున్నారు.

ప్లాస్టిక్ నివారణపై ప్రత్యేక దృష్టి

మున్సిపాల్టీ పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే హోటల్స్, కిరాణా దుకాణాలు, షాపుల్లో దాడులు చేపడుతున్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాల్టీగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రతీరోజూ దాడులు చేస్తున్నాం.

రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం



గార: శ్రీకూర్మంలో సీతారాముల తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



కంచిలి: శుభరాట వేస్తున్న నిర్వాహకులు



ఇచ్ఛాపురం: భజన చేస్తున్న కళాకారులు

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

జిల్లాలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలుచోట్ల శుభరాట వేశారు. అలాగే ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

- **కంచిలి:** కంచిలి రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన శ్రీరామనవమి పూజా మహోత్సవానికి సంబంధించి శుభరాటను మంగళవారం వేశారు. ప్రతి ఏటా తొమ్మిది రోజులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పూజా కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బి.కామేష్‌రెడ్డి, ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు, హరి, ఎంఎం పట్నాయక్ పాల్గొన్నారు.
- **గార:** మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.ఈమేరకు సీతారాములు విగ్రహాలను మేళతాళాలతో తిరువీధి నిర్వహించి పూజలు నిర్వహించారు. శ్రీకూర్మంలో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది.
- **ఇచ్ఛాపురం:** టి.బరంపురంలో వెలిసిన సీతారామాలయంలో సీతారామస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయంస్వామి వారికి అఖండ దీపారాధన, కంకణదారణ, పుణ్యాహవాచనం, అనంతరం స్వామి వారి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వ హించారు.సాయంత్రం సీతారామ భక్తిభజనమండలి కళాకారులతో స్వామివారికి స్వరాచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాయకులు గణేష్, ఉమాపతి, తమ్మయ్య, డోలక్‌పై బాలకృష్ణ ఆచారి సహకరించారు. అనంతరం సర్పంచ్ కారంగి త్రినాథ్ కళాకారులకు సత్కరించారు.

చంద్రబాబును కలిసిన రామ్మోహన్, కలమట

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం): శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల పాతపట్నం నియోజకవర్గం అభ్యర్థిగా మామిడి గోవిందరావుకు టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అసంతృప్తితో ఉన్న కలమట వెంకటరమణ, ఆయన వర్గం నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధమయ్యింది. ఇటీవల చంద్రబాబునాయుడ్ని కలమటవర్గమంతా కలిసింది.మరోసారి రామ్మోహన్‌నాయుడును వెంటబెట్టుకుని వెళ్లి కలమట చంద్రబాబుకు నియోజకవర్గంలో పరిస్థితి వివరించారు. ఐదేళ్లనుంచి పార్టీ కార్యక్రమాలు చేస్తున్నానని, తనని కాదని మరొకరికి టిక్కెట్ కేటాయించడంతో పార్టీకి నష్టం జరుగుతుందని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. పాతపట్నంపై పునరాలోచించాలని ఎంపీ కూడా కోరినట్లు విశ్వసనీయ సమాచారం. కొద్దిరోజుల్లో నిర్ణయం వెల్లడిస్తామని బాబు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

టీడీపీలో 20 మంది చేరిక



కండువావేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: సోంపేట మండలంలోని తాళభద్ర పంచాయతీ రాణిగాం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కె.రాంప్రసాద్‌తోపాటు 20మంది టీడీపీలో చేరారు. మంగళవారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే అశోక్ ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు పాటుపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. చంద్రమోహన్, బి.జగన్నాథం పాల్గొన్నారు.

జగనాసురుడి నుంచి రాష్ట్రాన్ని విముక్తిచేయాలి

- ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్



పొందూరు: రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

బూర్జ: రానున్న ఎన్నికల్లో జగనాసురుడి నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. మండలంలోని వావాం గ్రామానికి చెందిన గొల్వి లక్ష్మీనారాయణ, బొల్లు రామ చంద్రరావు, బట్నరామారావు, మటుకోటి ప్రభు తదితర 20 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సహకరించాలని కోరారు.

దళ్లవలసలో 30 కుటుంబాలు..

పొందూరు: దళ్లవలసలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూనరవికుమార్ సమక్షంలో కిల్లాన సీతయ్య ఆధ్వర్యంలోటీడీపీలో చేరాయి.టీడీపీపై నమ్మకంతో చేరామని నాయకులు చేరిన కె.రమణ, భారతి, షర్మిల, జి. కృష్ణ, గోవింద్ తదితర కుటుంబాలు తెలిపాయి. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, వండాన మురళి, బి.శంకరభాస్కర్, బాడాన గిరి, కిల్లాన అప్పలరాము పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజల ఆదరిస్తే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకుడు కోరుకొండ రమణమూర్తి తెలిపారు.మంగళవారం సంత కొత్తవలసలో ఎంపీటీసీసభ్యులు గొర్లె సూర్యం ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్‌పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలి లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.

- **పొందూరు:** మండలంలోని బురిడి కంచరాంలో మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకివస్తే అమలుచేయబోయే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వండాన మురళి పాల్గొన్నారు.

ఎన్నికల కోసం ఎదురుచూపు

- శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్



కూరగాయల వ్యాపారికి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న శంకర్

అరసవల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక వర్గాలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయని, ఎన్నికలు ఎప్పుడెప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్నాయని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని 33వ డివిజన్‌లో ఇన్‌చార్జి నల్లారి మధు ఆధ్వర్యంలో ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ జగన్‌రెడ్డి నియంతృపాలన నుంచి విముక్తికోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పైడి వేణుగోపాల్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమా మహేశ్వరి, టీడీపీ నాయకులు ఆకుల శివ, ఆకుల రాజా, ఆకుల మోహన్, నీలాపు కిషోర్, మణి, మాధవ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్, జామి భీమశంకరరావు, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

కళాను కలిసిన ఎన్ఈఆర్



కళావెంకటరావును సన్మానిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: విజయనగరం జిల్లాలోని రాజాం క్యాంపుకార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావును కలిశారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ముప్పిడి సరేష్, కుమరాపు రవికుమార్, పిషిని జగన్నాథంనాయుడు, గొర్లె లక్ష్మణరావు, పిన్నింటి మధుబాబు, బాలి శ్రీను, సుంకరి ధనుంజయరావు, లంక నారాయణరావు, వెలిచేటి సురేష్ పాల్గొన్నారు.

రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించండి

కంచిలి: ఉద్దానం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే బారువ, సోంపేట (కంచిలి) రైల్వే స్టేషన్లలో అవకాశమున్న రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి బీన ఢిల్లీరావు కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రికి లేక రాసినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

108 మంది సామూహిక వ్రతాలు

ఇచ్ఛాపురం: బెల్లుపడ కొండపై కొలువుదీరిన త్రినాథాలయంలో మంగళవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 108 మంది జంటలు సామూహిక వ్రతాలు జరిపాయి.



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

15 నుంచి హటకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

శ్రీకాకుళంరూరల్: మండలంలోనిబైరి సింగుపురంలో వెలసిన హటకేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు ఈనెల 15 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఈవో కె.వెంకటరమణలు తెలిపారు. మంగళవారం ఆలయంలో విలేకరుతో మాట్లాడుతూ ఈనెల 15న చైత్ర శుద్ధ సప్తమి పురస్కరించుకుని రాత్రి ఎనిమిది గంటలకు ధ్వజారోహణం, 19న కొండమ్మపిలుపు, 20న ఉదయం తొమ్మిది గంటల నుంచి హటకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు, 21న సాయంత్రం ఆరు గంటల నుంచి సదస్యోత్సవం, 22న దీపోత్సవం, 23న నాకబలివసంతోత్సవం, 24న శక్తి ఉత్సవం(దూబ పట్టుట) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలోప్రధానార్చకులు పెంట చిట్టిబాబు, రామకృష్ణ శర్మనక్క శంకర్ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్టు వద్ద వాహనం తనిఖీ చేస్తున్న బేగం

కంచిలి: ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దు ఉండడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పలాస అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఐఏ బేగం తెలిపారు. మంగళవారం మండలంలోని ఘాటి ముకుందపురం కూడలి వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ చెకపోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.



నిర్మానుష్యంగా మారిన వన్‌వే జంక్షన్

ఎండల తీవ్రతకు
నిర్మానుష్యంగా మారిన ఆమదాలవలస

ఆమదాలవలస: ఎండతీవ్రతకు మంగళవారం ఆమదాలవలస పట్టణం నిర్మానుష్యంగా మారింది. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడి ప్రతాపం చూపించాడు. నిత్యంరద్దీగా ఉండే పట్టణంలోని ప్రధానమార్కెట్ బోసిపోయింది. ఏటాఉగాది పురస్కరించుకుని గ్రామీణ ప్రాంత ప్రజలు పలురకాల సామగ్రి ప్రథమ కొనుగోలు చేయాలని పట్టణానికి రావడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎండ తీవ్రతకు గ్రామీణ ప్రాంత ప్రజలకు సెంటిమెంట్ పక్కనపెట్టి ఇళ్లకే పరిమితమ య్యారు. ఉదయం పదిగంటల నుంచిసాయంత్రం నాలుగు గంటల వరకు తీవ్ర ఎండతో పాటు వడగాలులు వీశాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే వైఎస్సార్, వన్‌వే జంక్షన్, మార్కెట్ ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారాయి.



బోసిపోతున్న ఆమదాలవలస మార్కెట్ పరిసరాలు